

బుల్లి మట్టి యిల్లు

జంతువులను గురించి
రష్యన్ జానపద గాథలు

అనిల్

"రాదుగ" ప్రచురణాలయం · మాస్కో

చిత్రాలు ఇ. రచేవ్



బుల్లి మట్టి యిల్లు

జంతువులను గురించి
రష్యన్ జానపద గాథలు

అనువాదం: ఆర్వియార్

«ТЕРЕМ-ТЕРЕМОК»

Русские народные сказки

На языке телугу

The Little Clay Hut

Russian Folk Tales About Animals

In Telugu

ISBN 5-05-002045-X

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

జంతువుల్ని గురించిన రష్యన్ జానపద గాథలు యీ పుస్తకంలో సేకరించబడ్డాయి. అవి చమత్కారంగానూ, చిత్రంగానూ వుంటాయి. తప్పటడుగుల చిన్న పిల్లలకోసమే అవి ఉద్దేశించబడినా, అందరికీ యిష్టమనిపిస్తాయి. యీ పక్షులూ, జంతువులూ మనుషుల్లాగే మాట్లాడతాయి. మనుషుల్లాగే ఆలోచిస్తాయి, ప్రవర్తిస్తాయి. వాటిలో కొన్ని మంచివీ, కొన్ని చెడ్డవీ, కొన్ని ధైర్యంగలవీ, కొన్ని పిరికివీ, కొన్ని తెలివితక్కువవీ, కొన్ని గడుసువీ.

మనల్ని ఒక కొత్త మాయా లోకంలోకి తీసుకుపోయే ఇ. రచేవ్ కుంచెగీసిన అద్భుతమైన బొమ్మలు వాటికవే ఆనందదాయకాలు.



ఇందులో

ముల్లంగి దుంప



ఒక ముసలివాడు ఓ ముల్లంగి దుంపను పాతాడు. అది పెరిగి పెరిగి చాలా పెద్దదైంది. ముసలివాడు దాన్ని పీకబోయాడు. లాగి, లాగి ఎంత లాగినా దాన్ని పీకలేకపోయాడు. అందుకని అతను ముసలమ్మని పిలిచాడు.

ముసలమ్మ ముసలివాణ్ణి పట్టుకొంది, ముసలివాడు ముల్లంగి మొక్కని పట్టుకున్నాడు. లాగి, లాగి ఎంత లాగినా యిద్దరూ దాన్ని పీకలేకపోయారు.

అందుకని అవ్వ బుల్లి పిల్లని పిలిచింది. బుల్లి పిల్ల ముసలి అవ్వని పట్టుకుంది, ముసలి అవ్వ ముసలివాణ్ణి పట్టుకుంది, ముసలివాడు దుంప మొక్కని పట్టుకున్నాడు. లాగి, లాగి ఎంత లాగినా అందరూ కలిసి ముల్లంగి దుంపని పీకలేకపోయారు.



అందుకని బుల్లి పిల్ల కుక్కని పిలిచింది.

కుక్క బుల్లి పిల్లని వెనకనించి పట్టుకుంది, బుల్లి పిల్ల అవ్వని పట్టుకుంది, అవ్వ ముసలివాణ్ణి పట్టుకుంది, ముసలివాడు ముల్లంగి మొక్కని పట్టుకున్నాడు. లాగి లాగి ఎంత లాగినా అందరూ కలిసి దుంపని పీకలేకపోయారు.

అందుకని కుక్క పిల్లిని పిలిచింది.



పిల్లి కుక్కని పట్టుకుంది, కుక్క బుల్లి పిల్లని పట్టుకుంది, పిల్ల అవ్వని పట్టుకుంది. అవ్వ ముసలివాణ్ణి పట్టుకుంది, ముసలివాడు ముల్లంగి మొక్కని పట్టుకున్నాడు. లాగి లాగి ఎంత లాగినా అందరూ కలిసి దుంపని పీకలేకపోయారు.

అందుకని పిల్లి చుంచుని పిలిచింది. చుంచు పిల్లిని పట్టుకుంది. పిల్లి కుక్కని పట్టుకుంది, కుక్క బుల్లి పిల్లని పట్టుకుంది, పిల్ల అవ్వని పట్టుకుంది, అవ్వ ముసలివాణ్ణి పట్టుకుంది, ముసలివాడు ముల్లంగి మొక్కని పట్టుకున్నాడు. లాగి లాగి అందరూ కలిసి లాగారు. అఖరికి... అది... వూడి వచ్చేసింది.

బుల్లి మట్టి యిల్లు



ఒక రైతు మట్టికుండలున్న బండి తోలుకెడుతున్నాడు. దారిలో ఓ కుండ జారిపోయింది.

అలా అలా యెగురుకుంటూ ఓ యీగ వచ్చింది. కుండని చూసింది.

‘‘బలే!’’ అనుకుంది. ‘‘బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో యేమో యిందులో! ఓహోయ్! యెవరున్నారు లోపల?’’

చూసింది. కుండ ఖాళీ అని చూసి దాన్లోకి యెగిరింది. దాన్ని తన యిల్లు చేసేసుకుంది.

అలా అలా యెగురుతూ ఓ దోమ వచ్చింది.

‘‘బలే!’’ అనుకుంది. ‘‘బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో యేమో యిందులో! ఓహోయ్! యెవరైనా ఉన్నారా లోపల?’’

‘‘నేను, జుమ్ జుమ్మనే యీగని. మరి నువ్వెవరు?’’

‘‘జోరు—హోరు దోమని.’’

‘‘బలే, నువ్వూ నాతోబాటు యిందులో ఉండకూడదూ?’’ సరేనని లోపలికి యెగిరింది దోమ. ఆ రెండూ మట్టి కుండని తమ యిల్లు చేసుకున్నాయి.


కొంచెం సేపటికి పరుగెత్తుకుంటూ వచ్చిందొక చుంచు. ''బలే'' అనుకుందది. ''బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో ఏమో ఇందులో! ఓహోయ్! ఎవరైనా ఉన్నారా లోపల?''

''మేము. జుమ్ జుమ్మనే ఈగ, జోరు—హోరు దోమ. మరి నువ్వెవరూ?''

''కరకర బొక్కే చుంచుని.''

''బలే, నువ్వూ మాతోబాటు ఇందులో వుండ కూడదూ.'' సరేనని లోపలికి దూరింది చుంచు.

ఆ మూడూ మట్టి కుండని తమ యిల్లు చేసుకున్నాయి. బెకబెకలాడుతూ వచ్చిందొక కప్ప.



''బలే!'' అనుకుందది. ''బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో యేమో ఇందులో! ఓహోయ్! యెవరైనా ఉన్నారా లోపల?''


''మేము, జుమ్ జుమ్మనే ఈగ, జోరు—హోరు దోమ, కరకర బొక్కే చుంచు, మరి నువ్వెవరూ?''

''బెకబెకలాడే కప్పని.''

''బలే, నువ్వూ మాతోబాటు ఇందులో వుండ కూడదూ?'' సరేనని లోపలికి దూకింది కప్ప.

అవి నాలుగూ మట్టి కుండని తమ యిల్లు చేసుకు న్నాయి.

కొంచెం సేపటికి పరుగెత్తుకుంటూ వచ్చిందొక చెవులపిల్లి.




EP

''బలే'' అనుకుందది. ''బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో యేమో ఇందులో. ఓహోయ్! యెవరైనా ఉన్నారా లోపల?''

''మేము, జుమ్ జుమ్మనే ఈగ, జోరు—హోరు దోమ, కరకర బొక్కే చుంచు, బెకబెకలాడే కప్ప, మరి నువ్వెవరూ?''

''చురుకు కాళ్ల చెవులపిల్లిని. నేను మీకు తెల్సా? గుట్టనుంచి గుట్టకి గెంతుకుంటూ పోతాను.''

''బలే, నువ్వూ మాతోబాటు ఇందులో వుండ కూడదూ?'' సరేనని లోపలికి దూకింది చెవులపిల్లి.



ఆ అయిదూ మట్టి కుండను తమ యిల్లుగా చేసుకున్నాయి.



మరి కొంచెం సేపటికి పరుగెత్తుతూ వచ్చిందొక నక్క.

''బలే!'' అనుకుందది. బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో యేమో ఇందులో! ఓహోయ్! యెవరైనా ఉన్నారా లోపల?''

''మేము, జుమ్ జుమ్మనే ఈగ, జోరు—హోరు దోమ, కరకర బొక్కే చుంచు, బెకబెక లాడే కప్ప, చురుకు కాళ్ల చెవులపిల్లి, మరి నువ్వెవరూ?''

''ఈసుపీచు నక్కని. నేను మీకు తెలుసు! గొంతు నాది మధురం మొరగను నేను, అరవను.''







''నువ్వూ మాతోబాటు ఇందులో వుండకూడదూ?'' సరేనని లోపలికి దూరింది నక్క.

ఆ ఆరూ ఆ మట్టి కుండని తమ యిల్లు చేసుకున్నాయి.

ఇంకొంచెం సేపటికి పరుగెత్తుతూ వచ్చిందొక తోడేలు.

''బలే'' అనుకుందది. ''బుల్లి మట్టి యిల్లు. ఎవరుంటారో యేమో ఇందులో! ఓహోయ్! యెవరైనా ఉన్నారా లోపల?''

''మేము, జుమ్ జుమ్మనే ఈగ, జోరు—హోరు దోమ, కరకర బొక్కే చుంచు, బెకబెక లాడే కప్ప, చురుకు కాళ్ల చెవులపిల్లి, ఈసుపీచు నక్క. మరి నువ్వెవరూ?''

''బుర్రుబుర్రుమనే తోడేల్ని. నేను మీకు తెలుసు! ఆటలకైతే ఆగను నేను, ఎగిరి దూకుతాను ఎరమీదకి.''





‘‘బలే, నువ్వూ మాతోబాటు ఇందులో వుండకూడదూ?’’ సరేనని లోపలికి దూరింది తోడేలు.

ఆ యేడూ ఆ మట్టి కుండని తమ యిల్లు చేసుకున్నాయి. చీకూచింతా లేకుండా కలిసి వుండ సాగాయి.

ఒక రోజున పరుగెత్తుతూ వచ్చిందొక యెలుగుబంటి.

అది ఆ మట్టి కుండ దగ్గర ఆగి తలుపు తట్టింది.

‘‘ఓహోయ్ యెవరైనా ఉన్నారా లోపల?’’ అని అరిచింది.

‘‘మేము, జుమ్ జుమ్మనే ఈగ, జోరు—హోరు దోమ, కరకర బొక్కే చుంచు, బెకబెకలాడే కప్ప, చురుకు కాళ్ల చెవులపిల్లి, ఈసుపీచు నక్క, బుర్రుబుర్రు తోడేలు. మరి నువ్వెవరు?’’

‘‘గద్దించి ఉరిమే ఎలుగుబంటిని. గట్టిగా పట్టుకున్నానంటే మీ పని ఠా!’’ అలా అంటూ కుండమీద కూర్చుంది యెలుగుబంటి. కుండ పగిలి ముక్కలయ్యింది. అందులో వున్న యేడు నేస్తాలూ భయపడిపోయి, చెల్లా చెదురుగా పరుగెత్తాయి.



తోడేలూ-
తెల్ల మేకపిల్లలూ



అనగా అనగా ఒక మేక ఉండేది. దానికి పిల్లలు వున్నాయి. మేక అడివిలోకి వెళ్లి పట్టు కుచ్చులాంటి గడ్డి మేసి, చల్లని తియ్యని నీళ్లు తాగుతూ వుండేది. తల్లి వెళ్లాక పిల్లలు తలుపు గడియ వేసుకుని పిసరు కూడా యివతలకి కనిపించకుండా వుండేవి. తల్లిమేక తిరిగి వచ్చాక తలుపు తట్టి పాడేది:

"నా బుల్లి పిల్లలూ, నా ముద్దు బిడ్డలూ,
తలుపు తెరవండీ, మీ అమ్మ వచ్చిందీ,
అమ్మ తెచ్చిందీ తీయటి చిక్కటి పాలు
తల్లి పొదుగులోనుండి వచ్చునూ
గుట్టు చప్పుడూ చేయకుండగా
పాలు కారునూ మెల్లమెల్లగా."

పిల్లలు తలుపు తెరిచి తల్లిని లోపలికి రానిచ్చేవి. తల్లి వాటికి పాలిచ్చి మళ్లీ అడివిలోకి వెళ్లేది. పిల్లలు ఎప్పటి మాదిరిగా తలుపు వేసుకుని వుండేవి.



తోడేలు తల్లిమేక పిల్లల్ని పిలవడం వింది. ఒక రోజున తల్లిమేక అడివికెళ్లాక అది యింటికి వచ్చి బండగొంతుతో అరిచింది:

"నా బుల్లి పిల్లలూ
నా ముద్దు బిడ్డలూ
తలుపు తెరవండీ
భయపడబోకండీ
మీ అమ్మ వచ్చిందీ
మీకు పాలు తెచ్చిందీ
పొదుగునుంచి కారు పాలు
పట్టుదారంలా."

మేకపిల్లలు యిలా బదులిచ్చాయి:

"మేం వింటున్నాం. నీవెవ్వరైనా అది మా అమ్మ గొంతుకాదు! అమ్మ గొంతు సన్నన. అమ్మ అనే మాటలూ తేడాగా వుంటాయి."

తోడేలు యేం చేస్తుందీ?

కమ్మరి కొలిమి దగ్గరకు వెళ్లింది. తన గొంతును చాలా సన్నంగా చేసి యిమ్మని కమ్మరిని అడిగింది. కమ్మరి దానికి కొత్త గొంతు చేసి యిచ్చాడు. తోడేలు మేక యింటి వద్దకు పరిగెత్తి పొదల వెనక పొంచి కూర్చుంది.

కొంచెం సేపటికి అడివినుంచి తల్లిమేక తిరిగి వచ్చింది. తలుపు తట్టి పిల్లల్ని పిలిచింది:

"నా బుల్లి పిల్లలూ, నా ముద్దు బిడ్డలూ,
తలుపు తెరవండీ, మీ అమ్మ వచ్చిందీ,
అమ్మ తెచ్చిందీ తీయటి చిక్కటి పాలు
తల్లి పొదుగులోనుండి వచ్చునూ
గుట్టు చప్పుడూ చేయకుండగా
పాలు కారునూ మెల్లమెల్లగా."






మేకపిల్లలు తలుపు తెరిచాయి. తమని తినెయ్యాలని తోడేలు వచ్చిన సంగతిని తల్లికి చెప్పాయి. తల్లిమేక పిల్లలకి పాలు యిచ్చి చాలా గట్టిగా చెప్పింది:


"గుర్తుంచుకోండి పిల్లలూ, యెవరేనా వచ్చి మీతో మాట్లాడినా, జాగ్రత్తగా వినండి. వాళ్ల గొంతు నా గొంతంత సన్నగా లేకపోయినా, నేను మాట్లాడినలాంటి మాటలనే మాట్లాడకపోయినా లోపలికి రానివ్వద్దు సుమా."

తల్లిమేక వెళ్లీ వెళ్లగానే తోడేలు పరిగెత్తుకుంటూ వచ్చింది. తలుపు తట్టింది. అది సన్నని గొంతుతో యిలా పిలిచింది:





"నా బుల్లి పిల్లలూ, నా ముద్దు బిడ్డలూ,
తలుపు తెరవండీ, మీ అమ్మ వచ్చిందీ,
అమ్మ తెచ్చిందీ తీయటి చిక్కటి పాలు
తల్లి పొదుగులోనుండి వచ్చునూ
గుట్టు చప్పుడూ చేయకుండగా
పాలు కారునూ మెల్లమెల్లగా."



పిల్లలు తలుపు తెరిచాయి. తోడేలు దూసుకువెళ్లి వాటి నన్నిటినీ గుటకాయస్వాహా చేసేసింది. ఒక్క మేకపిల్ల మాత్రం పొయ్యిలో దాక్కుంది.

కొంతసేపటికి తల్లిమేక యింటికి వచ్చింది. యెంత అరిచినా యెవరూ బదులుపలకలేదు. తలుపు తెరిచే వుండటం చూసి లోపలికి పరిగెత్తింది. యిల్లు ఖాళీగా వుంది. పొయ్యిలోకి చూసింది. బుల్లిమేక అక్కడ వుంది.



పిల్లల గతి విన్న తల్లిమేక దుఃఖానికి అంతులేకపోయింది. అది బల్లమీద కూలిపోయి వెక్కివెక్కి యేడవసాగింది. పదేపదే యిలా అనుకుంది:

“నా ముద్దు బిడ్డలూ, నా సొంత కూనలూ,
ఒంటరిగా మిమ్మల్ని యెందు కొదిలి వెళ్లానూ,
ఆ దుష్ట తోడేలుకు మీరు తలుపు తెరిచారూ
యెప్పటికీ మిమ్మల్నిక కాంచలేను నేనూ.”

తోడేలు దాని మాటలు వింది. యింటిలోకి వచ్చి యిలా అంది:

“నన్నెందుకు అంత దుష్టగా చూస్తావు మేకమ్మా! నేను కాదు నీ పిల్లల్ని తిన్నది! విచారించకు. అడివిలోకి అలా షికారుకి పోయొద్దాం రా.”







అవి అడివిలోకి వెళ్లాయి. కొంచెం సేపట్లోనే గుంతలో మండు తున్న మంట కనిపించింది. అవి దాని దగ్గరికి వెళ్లాయి. తల్లిమేక తోడేలుతో యిలా అంది:

‘‘తోడేలూ, రా, మనలో యెవరు యీ గుంత దాటుతారో చూద్దాం.’’

ఒకేఒక్క పెద్ద గెంతుతో అది దాటిపోయింది. తర్వాత గెంతింది తోడేలు. కాని కాలు జారి మంటలో పడిపోయింది. ఆ వేడికి దాని పొట్ట పగిలింది. దానిలోంచి మేకపిల్లలు క్షేమంగా బయటకు ఉరికి, తల్లి దగ్గరకి పరిగెత్తాయి! అప్పట్నుంచీ అవి సుఖంగా బతికాయి.

నక్కా - పిట్టా


Е.Р.



అనగా అనగా ఒక చెట్టుమీద ఓ పిట్ట గూడు కట్టుకుంది. అది గుడ్లుపెట్టి బుజ్జి పిల్లల్ని పొదిగింది. నక్క యీ సంగతి విని చెట్టు దగ్గరికి వచ్చింది. చెట్టుని తోకతో తడుతూ అక్కడ కూర్చుంది. యేమిటి సంగతి చెప్మా అని పిట్ట గూటిలోనుంచి తొంగిచూసింది.

"నా తోకతో యీ చెట్టుని కొట్టేసి నిన్నూ, నీ పిల్లల్నీ తినేస్తా" అంది నక్క.

పిట్టకి నక్కంటే భయంవేసింది. ప్రాధేయపడి, బతిమాల నారంభించింది.

"నా చెట్టును నరకవద్దు, నక్కమ్మా" అని యేడ్చింది. "నా పిల్లల్ని వదిలిపెట్టు, నీకు తేనే, కేకూ తినిపిస్తా."

"నాకు తేనే, కేకూ తినిపిస్తే నేనీ చెట్టును నరకను."

"అయితే నాతో రహదారిలోకి రా" అంది పిట్ట.

పిట్ట పైన యెగురుతూ, వెనక నక్క పరిగెడుతూ అవి రహదారిలో బయల్దేరాయి.

బుట్టనిండా కేకులూ, జాడీనిండా తేనే మోసుకొస్తూ ఒక ముసలావిడా, ఆవిడ మనుమరాలూ దారిలో రావడం చూసింది పిట్ట.

నక్క పొదల్లో దాక్కుంది. పిట్ట తను యెగరలేనట్టు నటిస్తూ రోడ్డుమీద పరిగెట్టింది. నేల మీంచి కొంచెం పైకి లేచింది, మళ్లీ కిందికి వచ్చింది. కొంచెం యెత్తుకు యెగిరింది, మళ్లీ నేలమీద కింద పడింది.

"ఆ పిట్టని పట్టుకుందాం" అంది మనుమరాలు.

"యెలా మనం పట్టగలం?"

"మనం పట్టగలం ఖాయంగా, దాని రెక్క విరిగింది. పిట్ట యెంతో బావుంది."

కేకుల బుట్టనీ, తేనె జాడీనీ నేలమీద పెట్టి ముసలావిడా, మనుమరాలూ పిట్ట వెనకాల పరిగెత్తారు.

పిట్ట వాళ్లని కేకుల బుట్టనుంచీ, తేనె జాడీనుంచీ దూరంగా లాక్కుపోయింది. నక్క యెంతమాత్రమూ జాగుచెయ్యకుండా తినగలిగినన్ని కేకులు తిని, తాగగలిగినంత తేనె తాగి మిగిలినవి దాచుకుంది.

పిట్ట మళ్లీ తన చెట్టుమీదికి యెగిరిపోయింది. గూడు చేరిందో లేదో మళ్లీ నక్క తన తోకతో చెట్టుని తట్టడం మొదలెట్టింది.

"నా తోకతో యీ చెట్టుని కొట్టేసి నిన్నూ, నీ పిల్లల్నీ తినేస్తాను."

"చెట్టును నరకవద్దు, నక్కమ్మా, నా పిల్లల్ని వదిలిపెట్టు. నీకు బీరు యిస్తాను."

"త్వరగా కానియ్ మరి. చాలా కేకులు తిని, బోలెడు తియ్యటి తేనె తాగిన తర్వాత నాకు మా చెడ్డ దాహంగా వుంది."

మళ్లీ పిట్ట యెగిరిపోయింది. దాని వెనకాతల రోడ్డుమీద నక్క పరిగెట్టింది.

బండిమీద బీరు పీపా పెట్టుకున్న పల్లెటూరివాణ్ణి చూసింది పిట్ట. అది అతని చుట్టూతా యెగిరి యెగిరి మొదట గుర్రంమీదా, తర్వాత పీపామీదా, తిరిగి గుర్రంమీదా వాలింది. పల్లెటూరివాడికి పిట్ట యెంత చిరాకు కలిగించిందంటే వాడు దాన్ని చంపేద్దామనుకున్నాడు. ఆఖరికి పిట్ట పీపాకుళాయిమీద వాలింది. పల్లెటూరివాడు పిట్ట కేసి గొడ్డలితో కొట్టబోయి, సరిగ్గా కుళాయిని కొట్టాడు. పిట్ట యెగిరిపోయింది. బండివాడు వెనకాల పరిగెట్టాడు.

బీరు రోడ్డుమీదకి కారిపోయింది. నక్క తాగగలిగినంత తాగి, పాట పాడుకుంటూ తన దారిన పోయింది.

పిట్ట గూటికి చేరుకోగానే, నక్క తోకతో చెట్టుని తడుతూ తయారైంది.

"పిట్టమ్మా, నాకు తిండి పెట్టావా?"

‘‘ఆఁ! పెట్టాను.’’

‘‘నాకు తాగడానికి నీరు యిచ్చావా?’’

‘‘ఆఁ! యిచ్చాను.’’

‘‘యిప్పుడు నన్ను నవ్వించు. లేకపోతే చెట్టుని తోకతో కొట్టేసి నిన్నూ, నీ పిల్లల్నీ తినేస్తాను.’’

పిట్ట నక్కని వూళ్లోకి తీసికెళ్లింది. అక్కడ ఆవుపాలు పితుకుతూ వున్న ముసలమ్మనీ, పక్కనే కూర్చుని గడ్డితో బూటు అల్లుకుంటూ వున్న ముసలాడినీ అవి చూసాయి.

పిట్ట ముసలిదాని భుజంమీద కూర్చుంది.

‘‘కదలకు. నీ భుజంమీద పిట్ట కూర్చుంది. దాన్ని చంపేస్తాను’’ అన్నాడు ముసలాడు. ముసలిదాని భుజంమీద చరిచాడు. కానీ పిట్ట అందలేదు.

ముసల్ది కింద పడింది. పాలబిందెని పడతోసింది. అప్పుడు లేచి ముసలాణ్ణి తిట్టడం మొదలెట్టింది.

తెలివితక్కువ ముసలాణ్ణి చూసి నక్క యెంతో సేపు నవ్వింది.

పిట్ట మళ్లీ గూటికి యెగిరిపోయింది. కాని తన పిల్లలకి అన్నం పెట్టే లోపునే మళ్లీ నక్క తోకతో చెట్టును తడుతూ అక్కడ సిద్ధమైంది.

‘‘పిట్టమ్మా, నాకు తిండి పెట్టావా?’’

‘‘ఆఁ! పెట్టాను.’’

‘‘తాగడానికి నీరు యిచ్చావా?’’

‘‘ఆఁ! యిచ్చాను.’’

‘‘నన్ను నవ్వించావా?’’

‘‘ఆఁ! నవ్వించాను.’’

‘‘యిప్పుడు నన్ను భయపెట్టు.’’

యీపాటికి పిట్టకి చాలా కోపం వచ్చింది.

‘‘సరే, కళ్లు మూసుకు నాతో రా.’’

పిట్ట ఎగురుతున్నంత సేపూ పిలుస్తూనే వుంది. వెనకాలే నక్క కళ్లు మూసుకుని పరిగెట్టింది. పిట్ట నక్కని తిన్నగా వేటకుక్కల గుంపుతో వున్న కొంతమంది వేటగాళ్ల దగ్గరికి తీసికెళ్లింది.






''యిప్పుడు నువ్వు భయపడచ్చు, నక్కమ్మా.''

నక్క కళ్లు తెరిచింది, వేటకుక్కల్ని చూసింది. మాంచి వేగంగా పారిపోయింది. కుక్కలు వెనకాలే పరిగెట్టాయి. నక్క తన బొరియ దగ్గరికి వెళ్లి, ఆయాసం తీర్చుకుంటూ, అందులో కూర్చుంది.

''మీరేం చేస్తున్నారు, కళ్లూ?''

''వేటకుక్కలు నిన్ను తినకుండా జాగ్రత్తగా చూసాం.''

''మీరేం చేస్తున్నారు, చెవులూ?''





"వేటకుక్కలు నిన్ను మింగకుండా జాగ్రత్తగా విన్నాం."

"మీరేం చేస్తున్నారు, కాళ్లూ?"

"వేటకుక్కలు నిన్ను పట్టకుండా జాగ్రత్త పడుతూ పరిగెత్తాం."


"నువ్వేం చేస్తున్నావ్, తోకా?"

"నువ్వు మరీ వేగంగా పరిగెత్తకుండా తుప్పల్నీ దుబ్బుల్నీ కొమ్మల్నీ పట్టుకున్నా."

తోకమీద మరి నక్కకి కోపం వచ్చింది. బొరియలోంచి తోకని యివతలికి నెట్టింది.

"రండి, నా తోకను తినండి, వేటకుక్కలూ!"

వేటకుక్కలు తోకతో నక్కని పట్టుకుని బొరియలోంచి యివతలకి లాగాయి.



రైతూ-ఎలుగుబంటీ



ఒక రైతు టర్నిప్ దుంపలు పాతడానికి అడివిలోకి వెళ్లాడు. అతను దున్నుతూండగా ఒక ఎలుగుబంటి వచ్చింది.

“రైతూ, నీ యెముకలు విరగ్గొట్టబోతున్నాను.”

“ఎలుగూ, దయచేసి నా యెముకలు విరగ్గొట్టద్దు. దాని బదులు టర్నిప్ దుంపలు పాతడానికి నాకు సాయం చెయ్యి. కింది భాగం నేను తీసుకుంటాను. పై భాగం నువ్వు తీసుకో.”

“సరే కానీ, నన్ను మోసం చేశావో, యిక చూసుకో నీ అంతు తేలుస్తాను” అంది ఎలుగు బంటి.



ఆలా అని దట్టమైన అడివిలోకి వెళ్లిపోయింది.

టర్నిప్ దుంపలు పెద్దవయాయి. ఆకురాలు కాలంలో రైతు వాటిని తవ్వడానికి వెళ్లాడు. అడివిలోనుంచి ఎలుగుబంటి వచ్చి అంది:

''రావయ్యా, రైతూ, టర్నిప్ దుంపలని పంచుకుందాం.''

''సరే ఎలుగూ, పై భాగం నీది, కింది భాగం నాది'' రైతు ఎలుగుబంటికి ఆకులన్నీ యిచ్చేసాడు. దుంపల్ని తనే బండిమీద పేర్చుకుని పట్టణానికి అమ్ముకోడానికి పోయాడు.

దారిలో యెలుగుబంటి తగిలింది.

''ఎక్కడికి పోతున్నావ్'' అడిగింది ఎలుగుబంటి.

''పట్టణానికి పోతున్నాను, ఎలుగూ, కింది భాగం అమ్ముకోడానికి.''

''యేదీ, నీ దుంపలు యెలా వుంటాయో రుచి చూడనీ.''

రైతు ఎలుగుబంటికి ఓ దుంప యిచ్చాడు. ఎలుగుబంటి దుంపని రుచి చూసీ చూడగానే గట్టిగా అరిచింది: ''ఆహాఁ! నువ్వు నన్ను మోసం చేసావు. నీ దుంపలు నా ఆకులకంటె యెంతో తియ్యగా వున్నాయి. కట్టెలకోసం నా అడవిలోకి వచ్చావో, నీ యెముకలు విరిచేస్తాను.''

ఆ తర్వాతి యేడు రైతు అదే చోట రై ధాన్యం విత్తాడు. కోసుకునేందుకు వెళ్లేటప్పటికి ఎలుగుబంటి అతనికోసం యెదురుచూస్తూ వుంది.

''యీ సారి నన్ను మోసం చెయ్యలేవు, నాయనా, నా వాటా నాకియ్యి'' అంది ఎలుగుబంటి.

మరి రైతు అన్నాడు: ''అలాగే కానీ యీసారి కింది భాగం యిస్తాను. పైదాంతోటే నేను తృప్తిపడతాను.''

రై పొలం దగ్గరికి చేరారు. రైతు మొదళ్లన్నీ ఎలుగుకిచ్చి, ధాన్యం బండిలో చేర్చుకుని యింటికి పట్టుకుపోయాడు. ఎలుగుబంటి మొదళ్లన్నీ నమిలింది. కాని కొయ్య ముక్కని కొరకడం లాగే వుందది.

రైతంటే దానికి కోపం వచ్చింది. అప్పట్నుంచీ రైతూ, ఎలుగుబంటీ శత్రువులుగానే వుండిపోయారు.

నక్కా - కొంగా



ఒక నక్కా, ఒక కొంగా స్నేహితులయ్యాయి. నక్క తన మిత్రుడైన కొంగను ఆదరించాలని భోజనానికి పిలిచింది:

“వచ్చి నాతో భోజనం చెయ్యి కొంగన్నా, నీకు నేను మంచి భోజనం పెడతాను.”

కొంగ సరేనంది. నక్క పాయసం వండి కంచంలో పోసింది. కొంగ తన పొడుగాటి ముక్కుతో కంచాన్ని చెడామడా పొడిచింది. యెంత పొడిచినా కంచంలోంచి ఒక్క పిసరంతయినా తినలేకపోయింది.

యీలోగా నక్క కంచాన్ని తన నాలుకతో నాకుతూ వుంది. నాకి నాకి కంచాన్ని శుభ్రం చేసింది. పాయసం మొత్తం తనే తినేసింది.

“నామీద కోపం తెచ్చుకోకు కొంగన్నా, నా యింట్లో ఉన్న దంతా అదే. అంతకంటె తింటానికి మరేమీ లేదు.”

“అయ్యో దాని దేముందిలే నక్క చెల్లీ” అంది కొంగ. “యిహ నువ్వో రోజు తప్పకుండా వచ్చి నాతో భోంచేయాలి.”

కొంగ యింటికి నక్క భోజనానికి వెళ్లింది. కొంగ యేదో పులుసు చేసి సన్నమూతి జాడీలో పోసింది. జాడీ బల్లమీద పెట్టి అంది:


Е.Р.

''అంతా తినెయ్యి, నక్క చెల్లీ, యిదే నా యింట్లో ఉన్నదల్లా.''


నక్క తన జాడీ చుట్టూ తిరిగింది. యిలా ప్రయత్నించింది, అలా ప్రయత్నించింది. జాడీని నాకింది. వాసన చూసింది. కానీ ఆ పులుసు వొక్క బొట్టు కూడా తాగలేకపోయింది. యెందుకంటే దాని పెద్ద తల ఆ జాడీ మూతిలోపల పట్టదుకదా!

కానీ కొంగ తన పొడుగాటి ముక్కును జాడీలోకి పెట్టింది. పులుసంతా అయిపోయేదాకా జుర్రిజుర్రి తాగింది.

''నామీద కోప్పడకు నక్క చెల్లీ, కానీ నిజంగా అదే నా యింట్లో ఉన్నదంతా.''

కానీ నక్కకు కోపం వచ్చింది. ఒక వారానికి సరిపడా తిందామనుకొంది. కానీ యెంత ఆకలితో వచ్చిందో అంత ఆకలిగానూ యింటికి పోయింది. కొంగ దానికి బాగా బుద్ధిచెప్పింది.

అప్పట్నుంచీ నక్కకూ, కొంగకూ స్నేహం చెడింది.



బడాయికోరు కుందేలు



అనగా అనగా ఒక అడివిలో ఒక కుందేలు వుండేది. దానికి వేసవిలో తిండి బాగానే దొరికేది. కానీ, శీతాకాలంలో దొరికేది కాదు. అప్పుడది ప్రాణం నిలబెట్టుకోడానికి రైతుల ధాన్యం దొంగిలించవలసి వచ్చేది.

ఒక రోజున అది ఒక పొలానికి వెళ్లింది. అక్కడ నూర్పిడి కళ్లం దగ్గర ఒక కుందేళ్ల గుంపు వుండింది. అంచేత అది చేసేది యేముంది? తనకి చేతనైనంత మేరకి డబ్బా కొట్టుకోవడమూ, గొప్పలు చెప్పుకోవడమూ మొదలెట్టింది.

"యెవ్వరికీ నా మీసాల్లాంటి పొడుగాటి మీసాల్లేవు, పెద్ద పంజాల్లేవు, పదునైన పళ్లు లేవు. నాకెవరన్నా భయంలేదు" అందది.

ఆ కుందేళ్లకి విని విని విసుగెత్తింది. అవి ముసలి కాకమ్మత్తకి బడాయికోరు కుందేలుని గురించి చెప్పాయి.

ముసలి కాకమ్మత్త బడాయికోరు కుందేల్ని చూడ్డానికి వెళ్లింది. అది గుబురులో దాగి వుండటం చూసింది.

దాన్ని చూసి బడాయికోరు కుందేలు హడలిపోయి కూర్చుంది.

"యింకెప్పుడూ గొప్పలు చెప్పుకోను, కాకమ్మత్తా, తల్లితోడు, యింకెప్పుడూ" అందది.

"నువ్వేం గొప్పలు చెప్పుకున్నావ్."

‘‘యేముందీ, యెవరికీ నాకున్నంత పెద్ద మీసాల్లేవు, పెద్ద పంజాల్లేవు, పదునైన పళ్లు లేవు.’’

ముసలి కాకమ్మత్త బడాయికోరు కుందేలు చెవులు పట్టుకుని గుంజేసింది.

‘‘యింకెప్పుడూ బడాయి పోకు’’ అంది.

ఒక రోజు ముసలి కాకమ్మత్త కంచెమీద కూర్చుంది. అప్పుడు కొన్ని కుక్కలు పరుగెత్తు కొచ్చాయి. ముసలి కాకమ్మత్తని తటాలున పట్టుకుని కిందికి లాగి పీడించడం మొదలెట్టాయి.


బడాయికోరు కుందేలు వాటిని చూసింది. దానికి ముసలి కాకమ్మత్తంటే జాలేసింది.

‘‘పాపం, ముసలి కాకమ్మత్త. నేనావిడకి సాయం చెయ్యాలి’’ అనుకుంది. ఒక దిబ్బ మీదకి వురికింది.

బడాయికోరు కుందేలుని చూసి కుక్కలు ముసలి కాకమ్మత్తని వదిలేసాయి. అది కంచె మీదకి యెగిరిపోయింది. కుక్కలు కుందేలు వెంటబడ్డాయి. కాని బడాయికోరు కుందేలు చాలా వేగంగా పరిగెత్తిపోయింది. ఆ కుక్కలు దాన్ని పట్టుకోలేకపోయాయి.

కొంతకాలం తర్వాత ముసలి కాకమ్మత్తకి బడాయి కోరుకుందేలు ఎదురుపడింది.

‘‘నువ్వు గప్పాలకోరువి కానేకాదు, నువ్వు నిజంగా ధైర్యం గల కుందేలువి. నువ్వు నా ప్రాణం దక్కించావు. అందుకు నీకు నేను రుణపడి వున్నాను’’ అంది.





ఎలుగుబంటీ - నక్కా



అనగా అనగా ఒక నక్కా, ఎలుగుబంటీ వుండేవి. ఎలుగుబంటి శీతాకాలం నాటికని అటక మీద ఒక పీపానిండా తేనె దాచుకుంది.

ఆ నక్క యీ తేనె సంగతి విని యెలా అందులో కొంత కొట్టెయ్యాలా అని ఆలోచించింది. అది ఎలుగుబంటి యింటికి వెళ్లి కిటికీకింద నుంచుంది.

''ఎలుగన్నా, నా కష్టాల్లో నాకు సాయంచేస్తావా?''

''నీ కష్టం యేమిటి నక్క చెల్లీ?''

''నా యిల్లు పాతదైపోయింది. తునకలుగా పడిపోతోంది. నాకు నెగడి లేదు. నన్ను నీ యింట్లో యీ రాత్రికి వుండనివ్వవూ?''

''అయితే లోపలికి రా'' అంది జాలిగల ఎలుగుబంటి.

అవి నెగడి దగ్గర పడుకున్నాయి. కాని జిత్తులమారి నక్క అంతసేపూ తేనె గురించే ఆలోచిస్తూవుంది. తన తోక ఆడిస్తూనే వుంది. నేలమీద దాని తోక తప తప చప్పుడుకి కొంచెం సేపట్లోనే ఎలుగుబంటికి మెలుకువ వచ్చింది.



''ఎవరా తట్టేది, నక్క చెల్లీ.''

''నాకోసం యెవరో వచ్చారు. పొరుగు వాళ్లింటిలో బిడ్డ పుట్టిందేమో.''

''అయితే నువ్వు వెళ్లు.''

నక్క అవతలికి వెళ్లింది. కొత్త బిడ్డని చూడ్డానికి కాదు, బయట నిచ్చెనమీద నుంచి యెక్కి అటకమీదున్న తేనె కొంచెం తాగేద్దామని వెళ్లింది. సుష్టుగా తాగి, మళ్లీ వెనక్కి వెళ్లి, నెగడి దగ్గర పడుకుంది.

''నక్క చెల్లీ, బిడ్డకేం పేరు పెట్టారు'' అని అడిగింది ఎలుగుబంటి.

''ఆదిగాడు.''

''చక్కటి పేరు.''

మర్నాడు అవి నిద్ర పోవడానికి పడుకున్నాయి. మళ్లీ నక్క తోకతో తపతపమని నేలమీద చప్పుడు చేసింది.

''ఎలుగన్నా, మళ్లీ ఓ కొత్త బిడ్డని చూడ్డానికి నన్ను పిలుస్తున్నారు.''

''అయితే నువ్వెళ్లు, నక్క చెల్లీ.''

యీసారి నక్క పీపాలో తేనె సగం తాగేసింది. మళ్లీ యింట్లోకి వెళ్లగానే ఎలుగుబంటి బిడ్డకి యేం పేరు పెట్టారని అడిగింది.

''నడుమగాడు.''

''చక్కటి పేరు.''

మూడోనాడు రాత్రి కూడా నక్క తోక తపతప కొట్టింది.

''నేను పోయి యింకో బిడ్డని చూడాలి'' అంది అది.

''బాగానే వుంది. కాని త్వరగా వచ్చెయ్యి. పొద్దున్నే తిండానికి అట్లు వేస్తున్నాను'' అంది ఎలుగుబంటి.

''యిట్టే వచ్చెయ్యనూ.''

నక్క తిన్నగా అటకమీదకి పరుగెత్తింది. తేనె పీపా ఖాళీ చేసింది, ఆఖరికి పీపా మట్టు కూడా గోకేసింది.

వెనక్కి వెళ్లేటప్పటికి ఎలుగుబంటి మెలుకువగానే వుంది.

''సరే, నక్క చెల్లీ, బిడ్డకి యీసారి ఏం పేరు పెట్టారు?''



‘‘కోరంగాడు.’’

‘‘అన్నిటికంటే బాగుందీ పేరు. రా, అట్లు పోసుకుందాం.’’

ఎలుగుబంటి అట్లు కాల్చే పనిలో వుండగా, నక్క అడిగింది:

‘‘అట్లలోకి తేనె యెక్కడిది?’’

‘‘అటకమీద వుంది.’’

ఎలుగుబంటి అటక యెక్కి చూస్తే పీపా ఖాళీ. ‘‘ఎవరు తాగారీ తేనె?’’ అడిగింది. ‘‘నువ్వే నక్క చెల్లీ, మరెవళ్లూ తాగివుండరు.’’

‘‘బాగుంది! నీ తేనెని అసలు నేను చూణ్లే లేదు. నువ్వే తాగేసి నన్నంటున్నావేమో’’ అంది నక్క.

పాపం యెలుగుబంటి ఎంతో ఆలోచించింది.

‘‘ఎవరు తాగారో కనిపెట్టడానికి, మనం యేం చెయ్యాలో నాకు తెలుసు. మనం వెల్లకిలా యెండలో పడుకుందాం. యేం, మనలో యెవళ్లం తేనె తాగినా యెండ దాన్ని కరిగించేస్తుంది. అది చర్మంగుండా బయటికి వచ్చేస్తుంది’’ అంది ఆఖరికది.

అవి యెండలో పడుకున్నాయి. ఎలుగుబంటి కొంచెం సేపట్లోనే నిద్రపోయింది. కాని జిత్తులమారి నక్కకి నిద్రపోవాలంటే భయం వేసింది. తన పొట్టమీదనుంచి తేనె చుక్కలు కారేదాకా కాపలా కాస్తూవుంది. వేగంగా వాటిని తుడిచేసి ఎలుగుబంటి పొట్టమీద రాసేసింది.

‘‘ఏయ్! ఎలుగన్నా! లే! చూడు తేనె ఎవరు తాగుతున్నారో!’’

పాపం, ఆ ఎలుగుబంటి చెయ్యగలిగింది యేమీ లేకపోయింది!



మేకా, పొట్టేలూ, పిల్లీ



అనగా అనగా ఒక మేకా, పొట్టేలూ ఒక దొడ్డిలో వుండేవి. అవి చాలా స్నేహంగా వుంటూ ప్రతీదాన్నీ సమంగా పంచుకునేవి, చిన్న గడ్డిపరక అయినా సరే.

అలా వుండగా ఒక రోజున పొట్టేలూ, మేకా నేలమీద పడుకుని కబుర్లు చెప్పుకుంటూ వున్నాయి. అంతలోనే హఠాత్తుగా ఓ పిల్లి ప్రత్యక్షమైంది. అది వాళ్ల దగ్గరికి వెళ్లింది. దాని కళ్లలో నీళ్లు ధారగా వచ్చాయి.

"యెందు కేడుస్తున్నావ్, పిల్లిబావా?" అని అడిగాయి మేకా, పొట్టేలూ. "అరె కుంటుతున్నట్లు కూడా వున్నావే?"

"యేం చెయ్యను? అమ్మగారు నన్ను కొట్టింది. నా చెవులు మెలిపెట్టింది. నన్ను నదిలో ముంచేస్తానంది."

"ఆవిడ అంత మాట అండానికి నువ్వేం చేసావ్?"

"మీగడ నాలికతో నాకాను, అదీ జరిగింది!"

పిల్లి భోరుమని మళ్లీ యేడ్చింది.

"యిప్పుడెందుకు యేడుస్తున్నావ్" అని నేస్తాలు అడిగాయి.

"యేం చెయ్యను? నామీదకి వస్తూ అమ్మగారంది: 'మా అల్లుడు భోజనానికి వస్తున్నాడు. అతనికి పెట్టడానికి మీగడ లేదు. పొట్టేలునీ, మేకనీ కోసి పెట్టడం తప్ప యింకేమీ లేదు!' "



మేకా, పొట్టేలూ మండిపడ్డాయి.

''నువ్వు మమ్మల్నెందుకు చిక్కుల్లో పడేసావు. అందుకు నిన్ను మేం కుమ్మి చంపుతాం, తెలిసిందా'' అని అరిచాయి.

కాని పిల్లి తను నిజంగా బాధపడుతున్నానంది. వాటిని క్షమించమని అడిగింది. మేకా, పొట్టేలూ దాన్ని క్షమించాయి. ఆ మూడూ కూచుని యేం చెయ్యాలా అని ఆలోచించడం మొదలెట్టాయి.

''యేదీ, నీ తలెంత గట్టిగా వుందో చూపించు, పొట్టేలన్నా. ఆ గుమ్మాన్ని దీంతో కొట్టి తెరవగలవేమో చూడు'' పిల్లి అంది దాంతో.

పొట్టేలు లేచినుంచుంది. గుమ్మంకేసి వేగంగా పరిగెత్తుకెళ్లింది. దాన్ని తన తలతో కొట్టింది. గుమ్మం కి(రుమంది కాని తెరుచుకోలేదు.

''రా, మేకన్నా, నీ తల యెంత గట్టిగా వుందో చూపించు'' అంది పిల్లి. మేక నుంచుంది, గుమ్మం కేసి దూసుకుపోయింది. దాన్ని ఢీకొట్టింది. ఆశ్చర్యం! గుమ్మం తెరుచుకుంది.


మేకా, పొట్టేలూ పరిగెత్తాయి. వెనకాల మూడు కాళ్లమీద కుంటు కుంటూ వెళ్లింది పిల్లి. అవి యెంత వేగంగా పరిగెత్తాయంటే గడ్డి అణిగిపోయింది, చుట్టూతా దుమ్ము మబ్బుల్లా లేచింది. పిల్లి తొందరగా అలిసిపోయింది.

''మీతో నేను ఉజ్జీకాలేను'' అందది మేక తోటీ, పొట్టేలు తోటీ ''నామీద కనికరం చూపించండి.''

''మేక పిల్లిని యెత్తి వీపుమీద యెక్కించుకుంది. మూడూ మళ్లీ పరుగుతీశాయి — అడ్డంవచ్చిన అడవులూ, పొలాలూ, బీళ్లూ, మిట్టలూ, పల్లాలూ, యెత్తైన కొండలూ దాటుకుంటూ.

అవి ఆగకుండా పగలూ, రా(తీ పరిగెత్తాయి. పచ్చపచ్చగా వున్న ఒక కొండదగ్గరికి చేరాయి. కింద లోతైన కనుమ వుంది. బోలెడు గడ్డి మేటల్లున్న పొలం అది. వాటిలో ఒక్కొక్కటీ ఒకో వూరంత వున్నాయి. పొట్టేలూ, మేకా, పిల్లీ అక్కడ వి(శాంతికోసం ఆగాయి. కాని అది ఆకురాలు కాలం. రా(తి చలిగా వుంది. అవి చలిమంట యెలా వేసుకోవాలి!

పొట్టేలూ, మేకా యేం చెయ్యాలా అని ఆలోచించాయి. అవి యింకా యేదీ అనుకునే లోపునే పిల్లి కొండ రావి చెట్టుపట్ట పంజాలో పెట్టుకుని తయారైంది. అది దాన్ని మేక కొమ్ములకి చుట్టేసి మేక తోటీ, పొట్టేలు తోటీ డీడిక్కి కొట్టుకోమంది.



అవి అలాగే చేసాయి. యెంత గట్టిగానంటే వాటి కళ్లల్లోంచి రవ్వలు యెగిరాయి. ఆ పట్టా అంటుకుని మండింది.

అవి నిప్పు తయారు చేసుకున్నాయి. వెచ్చగా కాచుకుంటూ చుట్టూతా కూర్చున్నాయి. కొంచెం వెచ్చబడుతున్నాయంతే, ఆశ్చర్యం! ఒక ఎలుగుబంటి అంగలేసుకుంటూ వాటి దగ్గరికి వచ్చింది.

''నన్ను కూడా మీ నెగడి దగ్గర చలికాచుకుని విశ్రాంతి తీసుకోనివ్వండి'' బతిమాలిందది. ''నేను అలిసిపోయి బడలికగా వున్నాను.''

''దాని దేముంది, అలాగే కాచుకో. యెక్కడికెళ్లావో చెప్పు మాకు.''

''నేను తేనెటీగల తోటలోకివెళ్లాను. తేనెటీగల కాపలావాళ్లతో నాకు పోట్లాట జరిగింది.''

చుట్టూ చీకటి అలుముకుంది. అంచేత అవి నిద్రపోడానికి నేలమీదకి ఒరిగాయి. ఎలుగుబంటి ఓ గడ్డిమేటికింద, పిల్లి గడ్డిమేటిపైనా, పొట్టేలూ, మేకా నెగడి దగ్గరా. హఠాత్తుగా ఏమిటబ్బా, ఏవో లగెత్తుకుంటూ వస్తున్నాయి! ఏడుబూడిద రంగు తోడేళ్లూ, ఒక తెల్ల దీనీ! అవి తిన్నగా గడ్డి మేటి దగ్గరకి పరిగెత్తాయి.

పొట్టేలూ, మేకా భయంతో అరవడం మొదలెట్టాయి. కాని పిల్లి జంకులేకుండా మాట్లాడుతూ అంది:


''నేను చెప్పేది విను. తోడేళ్ల యువ రాజా, తెల్ల తోడేలూ! జాగ్రత్త! లేకపోతే మా అన్న మేకకి కోపం వస్తుంది. అతనికి మహా చెడ్డకోపం. ఒక సారి రెచ్చగొడితే యెవళ్లనీ వదలడు. అతని శక్తి అంతా గడ్డంలో ఉంది. జంతువులన్నింటినీ అతడు అవలీలగా జయిస్తాడు. కొమ్ముల తోటి ప్రాణం ఉండగానే చర్మం ఒలిచేస్తాడు. నెమ్మదిగా అతని దగ్గరికి పోయి, అదిగో అక్కడుండే మా తమ్ముడుతో కుస్తీపట్టాలని వుందని చెప్పు. అతన్ని చూసావా? గడ్డిమేటికింద పడుకున్నాడు.''

తోడేళ్లు సరేనంటూ బుర్రలు వూపాయి. ఎలుగుబంటి పడుకున్న చోటికి వెళ్లాయి. దగ్గరసా వెళ్లాయి. దాన్ని పొడిచి పీడించడం మొదలెట్టాయి.

ఎలుగుబంటి కొంచెం సేపు సహించింది: చివరకి దానికి కోపం వచ్చేసింది. ఆ గుంపు నంతటినీ తన పంజాల్లోకి యిరికించుకుంది. తోడేళ్లు భయపడిపోయాయి. ఎలాగో ఎలుగుబంటి పట్టు తప్పించుకుని, కళ్లు మూసి తెరిచేలోగా అవి పారిపోయాయి.

యీలోపున మేకా, పొట్టేలూ పిల్లిని తమ మధ్యలో పట్టుకున్నాయి. ఆ మూడూ





అడవిలోకి పారిపోయాయి. అడివిలోకి వెళ్లాయో లేదో మళ్లీ అవే తోడేళ్లు సిద్ధం!

పిల్లి గబగబా ఒక చెట్టు చిటారు కంటా ఎక్కేసింది. పొట్టేలూ, మేకా తమ ముందటి కాళ్లు చెట్టు కొమ్మమీద పడేసి అక్కడ వేలాడాయి. అక్కడ, ఆ చెట్టుకింద, తోడేళ్లు నుంచుని పళ్లు పటపటా కొరికాయి.

పిల్లి పరిస్థితులేం బాగోలేవని గ్రహించింది. తోడేళ్లని కాయలతో కొట్టడం ప్రారంభించింది. అలా చేస్తూ అంది: ''ఒకటీ, రెండూ, మూడూ. మొత్తానికి మూడు తోడేళ్లు. మొన్న నా భోజనానికి రెండు తోడేళ్లు దొరికాయి. వాటిని యెముకలతో సహా తినడంవల్ల నాకింకా కడుపు నిండుగా ఉంది. కాని అన్నా నీకు తెగ ఆకలేస్తూ వుండాలే, అంచేత నా తోడేలుని కూడా నీకే తింటానికి యిస్తా. నువ్వు ఎలుగుబంటిని వేటాడటానికి వెళ్లావని నాకు తెలుసు, కానీ నీకు ఒక్కటీ దొరకలేదు కదా.''

అది అలా అందో లేదో, మేక పట్టుదప్పిపోయి, చెట్టు కొమ్మ వదిలేసి కొమ్ములు ముందుండే టట్టుగా, సరిగ్గా తోడేళ్లలో ఒకదానిమీద పడింది.

''వాటిని పోనివ్వకు! వాటిని పట్టుకో'' పిల్లి అరిచింది.

తోడేళ్లు మహా చెడ్డ భయపడిపోయాయి. కాళ్లకి బుద్ధి చెప్పి ఒక్క సారి కూడా వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయాయి. అవి కనుచూపుమేర దాటింతర్వాత పిల్లీ, దాని రెండు నేస్తాలూ తమ దారిన సుఖంగా వెళ్లి పోయాయి.

చిన్న పిల్లా -
అడవిబాతులూ



అనగా అనగా ఒక రైతూ అతని భార్యా వుండేవారు. వాళ్లకి ఒక చిన్న పిల్లా, చిన్న పిల్లవాడూ వున్నారు.

"అమ్మాయీ" అంది తల్లి పిల్లతో. "మేం పొలంలోకి వెడుతున్నాం. తమ్ముణ్ణి చూస్తూవుండేం. నువ్వు బుద్ధిమంతురాల్గా వుండి, వాకిలి దాటివెళ్లకుండా వుంటే నీకో కొత్త రుమాలు కొనిపెడతాం, సరేనా."

అమ్మా నాన్నా వెళ్లిపోయారు. కాని చిన్న పిల్ల యేం చెప్పారో మర్చిపోయింది. తమ్ముణ్ణి కిటికీ పక్క గడ్డిమీద కూర్చోబెట్టింది. తన నేస్తాలతో ఆడుకోవడానికి వెళ్లిపోయింది.

హఠాత్తుగా ఒక అడవిబాతుల గుంపు నేలమీద వాలింది. అవి తమ్ముణ్ణి పట్టుకుని, తమ రెక్కలమీద యెత్తుకుపోయాయి.

చిన్న పిల్ల యింటికి వచ్చింది. కాని అయ్యో! — తమ్ముడు లేడు. యిటూ అటూ పరిగెత్తింది. కాని వాడి జాడ తెలీలేదు.



వాణ్ణి పిలిచింది. అమ్మా నాన్నలనుంచి తనకి దెబ్బలు తగుల్తాయని అరుస్తూ వెక్కివెక్కి యేడ్చింది. కాని తమ్ముడి ఉలుకే లేదు.


అప్పుడు ఆరుబయట పొలంలోకి పరుగెత్తింది. కాని దూరంగా దట్టమైన అడవులు దాటి యెగిరే అడవిబాతులు తప్ప యేమీ కనిపించలేదు. వెంటనే ఆ పిల్ల అవే తన తమ్ముణ్ణి యెత్తుకుపోయి వుంటాయని అనుకొంది. అడవిబాతులు చెడ్డవనీ, పసిపిల్లల్ని యెత్తుకుపోతాయనీ లోకులు అంటారు.


అంచేత చిన్న పిల్ల పక్షుల వెనకాల పరిగెత్తింది. పరుగెత్తి పరుగెత్తి చివరకి ఒక పొయ్యి దగ్గరకి చేరుకుంది.

''పొయ్యీ! పొయ్యీ! ఆ అడవిబాతులు యెక్కడికి యెగిరిపోయాయో నాకు చెప్పవూ.''

''నా రైరొట్టెల్లో ఒకటి తిను, చెబుతాను'' అంది పొయ్యి.

''ఏంటీ, రైరొట్టె తినడమా? యింటిదగ్గర మేం గోధుమరొట్టెలు కూడా తినం!''





పొయ్యి ఆ పిల్లకి అడవిబాతుల జాడ చెప్పలేదు. పిల్ల యింకొంచెం ముందుకి పరిగెత్తింది. ఒక ఆపిల్ చెట్టుని చూసింది.

''ఆపిల్ చెట్టూ, ఆపిల్ చెట్టూ అడవిబాతులు ఎటు యెగిరిపోయాయో చెప్పవూ నాకు?''

''నా అడవి ఆపిల్ పండొకటి తిను, నీకు చెబుతాను'' అంది చెట్టు.

''మా నాన్నగారి తోటలో ఆపిల్‌పళ్లు కూడా మేం తినం.''

ఆపిల్ చెట్టు ఆ పిల్లకి అడవిబాతుల జాడ చెప్పలేదు. చిన్న పిల్ల పళ్ల హల్వాగట్టు వున్నపాలనది దాకా పరిగెత్తింది.

''పళ్ల హల్వాగట్టు పాలనదీ, అడవిబాతులు యెక్కడికెగిరాయో చెప్పవూ?''

''నా పాల హల్వా కొంచెం తిను. నీకు చెబుతాను.''

''మా నాన్నగారి యింటిదగ్గర మీగడ హల్వా కూడా మేం తినం.''

పాలనది ఆ పిల్లకి అడవిబాతుల జాడ చెప్పలేదు.

రోజంతా ఆ పిల్ల పొలాలమ్మటా, అడవులమ్మటా పరిగెట్టింది. సాయంత్రం అయేసరికి యింటికి పోవడం తప్ప యేంచెయ్యడానికీ లేకపోయింది. అంతలో హఠాత్తుగా కోడిపెట్ట కాలిమీద చిన్న కిటికీతో గిరగిరా తిరుగుతున్న గుడిసె కనిపించింది.



గుడిసెలోపల మంత్రగత్తె పీచు వడుకుతూ వుంది. పక్కన బల్లమీద ఆ పిల్ల తమ్ముడు వెండి ఆపిల్‌పళ్లతో ఆడుకుంటూ కూర్చున్నాడు.

చిన్న పిల్ల లోపలికెళ్లింది.

"దణ్ణం, మామ్మా."

"పిల్లా యేం యిలా వచ్చావ్?"

"నా గౌను తడిసిపోయింది. ఆరబెట్టుకుందామని వచ్చాను."

"అయితే కూర్చో. కొంచెం పీచు వడుకు." మంత్రగత్తె ఆ పిల్లకి కదురు అప్పజెప్పి బయటికి వెళ్లింది. చిన్న పిల్ల వడుకుతూ కూర్చుంది. అప్పుడొక చుంచు హఠాత్తుగా యినప పొయ్యికిందనుంచి వచ్చి, ఆ పిల్లకి చెప్పింది:

"పాపా, నాకు కొంచెం అంబలి యిస్తే నీకో సంగతి చెప్తా."

చిన్న పిల్ల దానికి అంబలి యిచ్చింది. చుంచు చెప్పింది:

"మంత్రగత్తె స్నానాల గదిలో మంట రాజెయ్యడానికి వెళ్లింది. నిన్ను అది ఆవిరితో కడిగి, శుభ్రంచేసి, పొయ్యిలో కాల్చేసి తినేస్తుంది."

చిన్న పిల్ల భయంతో వణికిపోతూ యేడవడం మొదలెట్టింది. కాని చుంచు చెప్పింది:

"తొందరపడు, నీ బుల్లి తమ్ముణ్ణి తీసుకొని పారిపో, నీ బదులు నేను పీచు వడుకుతా."

అంతే, చిన్న పిల్ల తమ్ముణ్ణి చేతుల్లోకి తీసుకొని పారిపోయింది. మంత్రగత్తె మాటి మాటికీ కిటికీదగ్గర కొచ్చి అంటూనే వుంది.

"వడుకుతున్నావా, పిల్లా?"

చుంచు జవాబిచ్చేది: "ఆఁ వడుకుతున్నా, మామ్మా."

మంత్రగత్తె స్నానాల గదిలో మంటలు రాజేసి చిన్న పిల్లకోసం వచ్చింది. కాని గుడిసె ఖాళీ. మంత్రగత్తె అరిచింది:


"ఎగిరిపొండి, అడవిబాతులూ, ఎగిరి వాళ్లని పట్టుకోండి. చిన్న పిల్ల తమ్ముణ్ణి యెత్తుకు పోయింది!"

చిన్న పిల్ల పాలనది వచ్చే దాకా పరిగెత్తింది. కాని యేం చూసిందక్కడ, తననీ, తన తమ్ముణ్ణీ వెంబడిస్తూ అడవిబాతులు వచ్చేస్తున్నాయి.

"పాలనదీ, పాలనదీ నన్ను దాచవూ, దాచేం" అడిగింది చిన్న పిల్ల.

"నా పళ్లహల్వా కొంచెం తిను."






చిన్న పిల్ల కొంచెం హల్వా తింది. చాలంది. పాలనది ఆ పిల్లనీ, తమ్ముణ్ణీ హల్వాగట్టు నీడలో దాచింది. ఆ పిల్లని చూడకుండా ఎగిరిపోయాయి అడవిబాతులు.

చిన్న పిల్ల మళ్లీ పరిగెత్తింది. కాని అడవిబాతులు వెనక్కి తిరిగి తిన్నగా ఆ పిల్ల కేసే యెగిరాయి. యే క్షణంలోనైనా అవి దాన్ని చూస్తాయి. తనేం చెయ్యాలి? ఆ పిల్ల ఆపిల్ చెట్టు దగ్గరికి పరిగెత్తింది.

"ఆపిల్ చెట్టూ, నన్ను దాచవూ, బాబ్బాబు."

"నా అడవి ఆపిల్ పళ్లు తిను."





చిన్న పిల్ల గబగబా ఒకటి తింది. చాలంది. ఆపిల్ చెట్టు ఆ పిల్లని తన కొమ్మల్లో ఆకుల్లో దాచింది.

అడవిబాతులు దాన్ని చూడకుండానే దాటుకుని యెగిరిపోయాయి.

చిన్న పిల్ల తన తమ్ముణ్ణి యెత్తుకొని మళ్లీ పరిగెత్తింది. దాదాపు యింటి దగ్గరకు వచ్చే టప్పటికి అడవిబాతులు ఆ పిల్ల జాడపట్టేసాయి. అవి ''బాంయ్'' మంటూ అరిచి రెక్కలు ఝాడించాయి. యింకో క్షణంలో తమ్ముణ్ణి ఆమె చేతుల్లోంచి తీసుకుపోయేవే.

చిన్న పిల్ల పరిగెత్తుకుంటూ పొయ్యి దగ్గరికి వచ్చింది.

''పొయ్యీ, పొయ్యీ, నన్ను దాచు, బాబ్బాబు.''

''నా రైరొట్టె ఒకటి తిను.''

చిన్న పిల్ల ఒక రొట్టెముక్కని గుటుక్కుని నోట్లో పెట్టుకుని తన తమ్ముడి తోటి పొయ్యిలోకి పాకింది.



అడవిబాతులు గిరగిరా తిరుగుతూ, అరుచుకుంటూ "బాంబామ్మం"టూ యెగిరాయి. కాని కొంచెం సేపు అయింతర్వాత వెంటాడటం మానేసి వెనక్కి మంత్రగత్తె దగ్గరికి యెగిరిపోయాయి.

చిన్న పిల్ల పొయ్యికి కృతజ్ఞత చెప్పి తన తమ్ముడితో యింటికి పరిగెత్తిపోయింది.

ఆ తర్వాత కొంచెం సేపటికి అమ్మా, నాన్నా యింటికి వచ్చారు.



"రాదుగ" ప్రచురణాలయం · మాస్కో

ISBN 5-05-002045-X